# 14

## 504- నవదీప్

అదివరకు పోలీసు కానిస్టేబుల్స్‌కీ, జైల్లో ఖైదీలకీ నెంబర్లుండేవి. ఇప్పుడు బహుళంతస్తుల భవనాల సంస్కృతి వచ్చాక అందరికీ నెంబర్లే. "మూడొందల మూడు అమ్మగారూ, అయిదొందల రెండు అమ్మగారూ కలిసి బజారుకెళ్ళారు. నూట మూడు నెంబరు అయ్యగారికి నూటమూడు జ్వరం. నాలుగువందల ఒకటి అబ్బాయి అమెరికా వెళ్తున్నారు" అని నెంబర్లతోనే వ్యవహరిస్తున్నారు.

మేము కూడా బహుళంతస్తుల భవనంలో వుంటున్నాం. కాబట్టి మాకూ ఒక నెంబరుంది. రెండొందల రెండు. నేనూ, మా ఆయనా, మా అక్కగారు వుంటాం. పిల్లలు రెక్కలొచ్చి ఎగిరిపోయారు. మా భవనంలోనే అయిదో అంతస్థులో మా మేనల్లుడు ఓ భాగం కొనుక్కున్నాడు. వాడు అమెరికాలో వుంటాడు కాబట్టి ఆ ఇంటి మంచీ చెడ్డా కూడా మేమే చూస్తాం.

ఆ వాటాలో వుండే ఆదినారాయణగారు ట్రాన్స్‌ఫరు అయి, వేరే ఊరు వెళ్ళిపోతూ "నా జాబ్‌లోకి వచ్చే ఆయనకే ఇవ్వండి" అన్నాడు. సాధారణంగా బ్యాంకు ఉద్యోగుల విషయంలో అదే జరుగుతూ వుంటుంది. మాకూ సుఖం.

మరుసటి వారంలోనే వచ్చాడు. వెంట బ్యాంకు అటెండరుని తోడు తీసుకొని వచ్చి "నా పేరు ఏవీరావు" అన్నాడు.

"వెంటనే మనది ఏ ఊరు నాయనా?" అంటూ రంగప్రవేశం చేసింది మా అక్క. దానికి ప్రశ్నలు వేసే పిచ్చి. 'ఏ ఊరు? ఏ కులం? పెళ్ళయిందా? పిల్లలెంత మంది? మీరెంతమంది అన్నదమ్ములు? వాళ్ళకెంతమంది పిల్లలు? వాళ్ళేం చేస్తున్నారు'

అని ప్రశ్నలతో పీక్కుతింటుంది. అందరిళ్ళలోకీ దూరిపోయి వాళ్ళ వివరాలు సేకరించి సలహాలిస్తూ వుంటుంది. వద్దంటే వినదు. ఒక్కోసారి ఈవిడ వల్ల మా ప్రాణాలమీదికి వస్తుంది.

నూట నాలుగింట్లో వుండే దంపతులకి పిల్లల్లేరు. లేరని దిగులూ లేదు. వయసయిపోయింది. వాళ్ళూరుకున్నా ఈవిడూరుకోదుగా! రోజూ వెళ్ళి 'నీ కడుపున ఒక కాయ కాయాలి, కాయ కాయాలి' అని దీవించే సరికి నిజంగానే ఆవిడకి కడుపులో ట్యూమరు వచ్చేసింది. ఆయన ఇంటిమీదికొచ్చి తిట్టిపోయాడు.

ఇప్పుడీ ఏవీరావుని పట్టుకుంది. ఆయన కాస్తా 'నాకీ ఇల్లొద్దు' అని పారిపోతాడేమో అని భయపడ్డాను. కానీ అతను సమాధానంగా "నా పేరు ఆచంట వరప్రసాదరావు. నా భార్య పేరు శ్రీలత. మాది గుంటూరు. అమ్మా నాన్న అక్కడే వున్నారు. నాకు తమ్ముడు. వాడు ఆస్ట్రేలియాలో వుంటాడు. వాడికి పెళ్ళయింది. నేను అక్క కూతుర్నే చేసుకున్నా. మా అక్కా బావా కాకినాడలో వుంటారు" అని చెప్పేశాడు. మరికొన్ని వివరాలడిగింది మా అక్క. అతను అవి చెప్పి ఇంకొన్ని వివరాలు కూడా చెప్పాడు.

ఆ తరువాత నావైపు తిరిగి పదండి పోలీస్ స్టేషనుకి అన్నాడు. "అదేంటి ఆవిడ ప్రశ్నవేస్తే నన్నెందుకు పోలీసులకి పట్టించడం?" అన్నాను. కాదుట. అదివరకుండే ఊళ్ళో ఇంట్లో చట్టవిరుద్ధమైన చర్యలేవో జరుగుతూ వుంటే ఓనరుతో పాటు తననీ అరెస్టు చేసి ఓ రాత్రంతా లాకప్‌లో పెట్టారుట. అప్పటి నుంచీ ముందు జాగ్రత్త చర్యగా, ఇంటివాళ్ళనీ, పనిమనిషినీ పోలీసులకి పరిచయం చెయ్యటం అలవాటు చేసుకున్నాడట.

నేను మాత్రం ఏనాడు పోలీసు స్టేషనుకి వెళ్ళలేదు. "నేను రాను" అని ఖచ్చితంగా చెప్పేశాను. ఏ మనుకున్నాడో ఏమో "అడ్రెస్ ప్రూఫ్ ఇవ్వండి" అన్నాడు. రేషన్ కార్డు ఇచ్చాను. "కావలిస్తే నేవస్తానయ్యా" అంది అక్కయ్య.

"వద్దులెండి" అన్నాడు.

నాల్రోజులకే వచ్చి చేరాడు. మహా హడావిడి మనిషి. తెల్లవారు జామున అయిందింటికి బెల్ కొట్టేవాడు. "మా పాలవాడింకా రాలేదు. నేను టీ తాగి మార్నింగ్ వాక్‌కి వెళ్ళాలి. ఓ పాల పేకెట్ ఇస్తారా" అనేవాడు.

ఇచ్చి పంపిస్తే నిముషం తర్వాత మళ్ళీ బెల్ కొట్టేవాడు. "మా పాలవాడు వచ్చేశాడు" అని ఆ పేకెట్ ఇచ్చేసేవాడు. అలా ఓ వారం రోజులు అలారం లాగా నిద్రలేపేసరికి మాకు అదే అలవాటై ఏనాడో మానేసిన మార్నింగ్ వాక్ మళ్ళీ మొదలు పెట్టాం.

ఓ రోజు పొద్దున్నే వచ్చి "మీ టెలిఫోన్ బిల్లివ్వండి. కనెక్షన్ కోసం వెళ్తే వాళ్ళడిగారు" అన్నాడు.

నేను లోపలికెళ్ళి బిల్ తెచ్చి ఇచ్చేలోగా మా డ్రాయింగ్ రూమ్ అద్దంలా సర్దేశాడు. అదేమిటంటే "ఊరికే నిలబడటం ఎందుకని పేపర్లనీ మడతపెట్టాను" అన్నాడు. చూడగా చూడగా నేను గమనించింది ఏమిటంటే అతనికి అమిత కంగారూ, హడావిడి. కాలూ చెయ్యీ ఒక్కక్షణం కూడా ఖాళీగా వుండకూడదు.

మరో రోజు వచ్చేశాడు. "ఈ ఊళ్ళో మంచి మెటర్నిటీ హాస్పిటల్ ఎక్కడో చెప్పండి" అన్నాడు.

"ఎందుకు?" అని అడిగాను.

అతని భార్య కడుపుతో వుంది. ఏడో నెల. ముందు పుట్టింట్లోనే పురుడు అనుకున్నారట. తీరా చూస్తే వాళ్ళ మామగారికి కాకినాడ నుండి కటక్ ట్రాన్స్ఫర్ అయిందిట. అది కొత్త ఊరు. పైగా మన రాష్ట్రం కూడా కాదు. కాబట్టి ఇక్కడికే తీసుకొద్దాం అనుకున్నాడట.

నాకు తెలిసిన హాస్పిటల్ గురించి చెప్పాను. అక్కడ చాలా సదుపాయంగా వుంటుంది. పసిబిడ్డనీ, బాలింతనీ, తోడు వుండే మనిషినీ అందరినీ వాళ్ళే చూసుకుంటారు. పదిసార్లు హాస్పిటల్‌కి పరిగెట్టే పనుండదు. మా అమ్మాయికి, కోడలికీ అక్కడే పురుళ్ళు అయ్యాయి. ఆ మాటే చెప్పాను.

"అయితే పదండి వెళ్దాం" అన్నాడు.

"ఇప్పుడు మనిద్దరం ఎందుకూ మెటర్నిటీ హోమ్‌కి. అమ్మాయిని రానీ!" అన్నాను.

"ముందు వెళ్ళి పరిచయం చేసుకొస్తే మంచిది కదా!" అన్నాడు.

"పరిచయానికి ఒకసారీ, పరీక్షకి ఒకసారీ వెళ్ళడానికి ఆ డాక్టరు కాళ్ళు చాపుకొని కూర్చోదు. ఆవిడకి అసలు ఊపిరాడదు. చాలా బిజీగా వుంటుంది" అన్నాను.

మంచిరోజు చూసుకుని భార్యని తీసుకొచ్చాడు. పిల్ల చక్కగా, చిలుకలాగా వుంది. కానీ స్వభావంలో మాత్రం ఇద్దరికీ చుక్కెదురు! అతను అంత హడావిడి. ఆ పిల్ల అమిత నిదానం.

ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకుని డాక్టరు దగ్గరికి వెళ్ళాం. ముగ్గురం వెళ్ళకూడదని మా అక్కా బయలుదేరింది. అక్కని బయట కూర్చోబెట్టి మేము ముగ్గురం డాక్టరు గదిలోకి వెళ్ళాం. డాక్టరు నన్ను గుర్తుపట్టి ప్రసన్నంగా పలుకరించింది. అయిదు నిముషాల్లో ఆవిడ ప్రసన్నత ఎగిరిపోయింది. అతనేమో ఒకమాట మాట్లాడాల్సిన దగ్గర పధ్నాలుగు మాటలు మాట్లాడతాడు. ఆ పిల్ల నోరిప్పదు.

"ముందీ శాల్తీని బయటికి తీసుకుపోండి" అంది నాతో విసుగ్గా.

'పద' అని అతన్ని తీసుకొచ్చాను. ఎలాగో వచ్చాంగా రూములు చూద్దాం అన్నాడు. రిసెప్షన్‌లో అడిగితే వాళ్ళ మనిషిని సాయం ఇచ్చి పంపించారు. అన్ని రూములూ తిరిగి చూసి వివరాలన్నీ ఓ కాయితం మీద రాసుకున్నాడు. కిందికి వచ్చాం. మా అక్కయ్య ఒక్కతే బిక్కుబిక్కుమంటూ కూర్చుని వుంది. "అదేమిటి ఇందాక చాలామంది జనం వున్నారుగా" అని అడిగితే ఆ పక్కనే వున్న ఆయా గయ్‌మని లేచింది. "ఈవిడ ప్రశ్నలకు తట్టుకోలేక పారిపోయారు. అక్కడా ఇక్కడా దాక్కున్నారు. ముందీవిడని తీసికెళ్ళండి" అంది.

మా అక్కయ్యనీ, అతన్నీ "మీరిద్దరూ వెళ్ళి కార్లో కూర్చోండి" అని పంపించాను. కాసేపటికి శ్రీలత బయటికొచ్చింది. హాస్పిట్ వాళ్ళు ఫైల్ ఇచ్చారు. అది తీసుకొని ఇంటికొచ్చాం.

అంతా బాగానే వుందన్నారు. తీసుకోవలసిన మందులూ, ఆహారం వగైరాలన్నీ వివరంగా రాసి ఇచ్చారు ఫైల్లో. ఆ ప్రకారం తు.చ. తప్పకుండా నడుచుకుంటున్నాడు ఏవీరావు. వాకింగ్ చెయ్యాలన్నదట డాక్టరు. ఠంచనుగా కిందికి తీసుకొచ్చేవాడు. ఆ అమ్మాయి ఒక రౌండు తిరిగేసరికి తను రొప్పుకుంటూ ఇరవై రౌండ్లు తిరిగేవాడు. ఏడో నెల నిండుతూ వుండగా భర్తనీ, సామాన్నీ కటక్ పంపించి వచ్చేసింది అతని అత్తగారు, అక్కగారూ అయిన సుజాత. తమ్ముడి కంటే హడావిడి మనిషి.

వచ్చిన మర్నాడే మా ఇంటికి వచ్చి "మీ ఇంట్లో కుట్టుమిషనుందా?" అని అడిగింది.

"లేదు గానీ, మూడొందల ఏడు వాళ్ళింట్లో వుంది" అని తీసికెళ్ళి పరిచయం చేశాను.

ఆ మర్నాడు మూడొందల ఏడు ఆవిడ ఏడ్చుకుంటూ వచ్చింది నా దగ్గరికి. "నిన్న పొద్దున తొమ్మిదింటికి మిషను ముందు కూర్చున్నావిడ రాత్రి తొమ్మిదైనా లేవదే! మా ఆయన ఒకటే తిట్లు. ఆ పుట్టబోయే బిడ్డకి జీవితాంతం లంగోటాలే కడతారా, సోద్యం కాకపోతేనూ? ఇక వెళ్ళిరండి అని బలవంతాన బయటికి తోశాను. 'రేపొద్దున మళ్ళీ వస్తా' అని వెళ్ళిపోయింది. ఆవిడని ఇంట్లోకి రానిచ్చావంటే కాళ్ళు విరగ్గొడతా అన్నారు మా ఆయన. ఏం చెయ్యను" అంది.

ఎందుకు తీసికెళ్ళానురా భగవంతుడా అనుకున్నాను. "మీ మిషను పాడైపోయిందని చెప్తాలెండి" అని ధైర్యం చెప్పి పంపించాను.

మా పనిమనిషి 'ఆ పై అమ్మకి నలతగా వుందట లేవలేదుట' అని సమాచారం మోసుకొచ్చింది. ఏడో నెల పిల్లకి నలత ఏమిటా అని కంగారుగా పరిగెట్టాం నేను, అక్కయ్యా. తీరా చూస్తే లేవనిది పిల్లకాదు. తల్లి. క్రితం రోజు పన్నెండు గంటలు ఏకధాటిగా మిషను కుట్టడం వల్ల నడుం పట్టేసింది. కాళ్ళు దుంగల్లా వాచిపోయాయి. అసలే ఆవిడకి కాస్త నడుం నెప్పిట కూడానూ.

"ఈ రోజుల్లో అన్నీ బజార్లో దొరుకుతున్నాయి. మీరు ఊరికే హైరాన పడకండి" అని చెప్పి వచ్చాను. శ్రీలతకి తొమ్మిదో నెల సగం పడింది. ఊర్నించి అమ్మమ్మ కమ్ అత్తగారు వచ్చింది. ఆవిడకి నడుముకీ, మెడకీ బెల్టులు. పని సాయం చెయ్యలేకపోయినా మాటసాయానికైనా వుంటాను అని వచ్చింది పాపం.

ఆ వేళ హాస్పిటల్‌కి వెళ్ళినపుడు ఈ వారంలోనే పురుడొస్తుంది అన్నదిట డాక్టరు. ఇక ఏవీరావు, వాళ్ళక్కా తెగ హడావిడి పడిపోయారు. హాస్పిటల్‌కి ఏక్షణాన వెళ్ళాల్సి వస్తుందా అని తల్లికీ, పిల్లకీ, కావలసిన వస్తువులన్నీ ఓ సూట్‌కేస్‌లో సర్దేసి బీరువా మీద పెట్టారు. ఇల్లు బూజులు దులిపేశారు.

ఆ పిల్ల 'అమ్మా' అనగానే కిందికి తీసుకొచ్చి వాచ్‌మెన్ కుర్చీలో కూర్చోబెట్టే వాళ్ళు. కరెంటుపోతే మెట్లు దిగటం కష్టం కదా! "నేను ఆఫీసుకి వెళ్ళినప్పుడు నెప్పులొస్తే హాస్పిటల్‌కి తీసికెళ్ళండి" అని బిల్డింగ్‌లో అందరికీ చెప్పాడు. ఆ శుభసమయం రానే వచ్చింది. శ్రీలతకి నొప్పులు మొదలయ్యాయి. ఆ వేళ ఆదివారం.

ఏవీరావు ఇంట్లోనే వున్నాడు. పరుగున వచ్చి నాతో చెప్పాడు. చీర మార్చుకుని పైకి వెళ్ళేసరికి అక్కడంతా గొడవ గొడవగా వుంది. అందరూ వాళ్ళింటి ముందు గుమిగూడి వున్నారు.

హాస్పిటల్‌కి తీసికెళ్ళాల్సిన సూట్‌కేస్ బీరువా మీదనుంచి దింపడానికి ప్లాస్టిక్ స్టూల్ ఎక్కి తియ్యబోయాడట ఏవీరావు. అది కాస్తా కాలు వంగిపోయి పక్కకి ఒరిగి పోతూంటే అక్కగారు పట్టుకోబోయిందిట. సాధ్యం కాలేదు. అక్కగారూ, ఆవిడమీద తమ్ముడూ పడిపోయారు. ఆ సూట్‌కేస్ జారి పక్కనున్న పెద్దావిడ మీద పడిందిట.

వీళ్ళని లేవదీయబోతే లేవలేకపోతున్నారు. వెంటనే నూట ఎనిమిదికి ఫోన్ చేశారు ఎవరో. వాళ్ళు పాపం పావుగంటలో వచ్చేశారు. ఆ ముగ్గుర్నీ అంబులెన్స్‌లో హాస్పిటల్‌కి తీసికెళ్లారు. రెండు కార్లు వేసుకుని కొంతమంది వాళ్ళతో వెళ్ళారు.

నేనూ, మరో ఇద్దరం కలిసి శ్రీలతని హాస్పిటల్‌కి తీసికెళ్ళాం. తెలిగ్గానే కాన్పు అయింది. మగబిడ్డ పుట్టాడు. అటువంటి ఆనంద సమయంలో వాళ్ళ కుటుంబ పరిస్థితి వర్ణనాతీతం.

ఏవీరావుకి కాలు ఫ్రేక్చరు. అక్కగారికి నడుము బెణికింది. ఆ పెద్దావిడకి మెడకి దెబ్బ తగిలింది. పది రోజులు హాస్పిటల్‌లోనే వుండాల్సి వచ్చింది. గుంటూరు నించి మామగారు, కటక్ నుంచి అల్లుడు వచ్చారుగానీ వాళ్ళేం చేస్తారు పాపం? అంత ఆపదలో వున్నా జరిగితే జ్వరం అంత సుఖం లేదు అన్నట్లు జరిగింది. బిల్డింగ్ అంతా ఏకమై ఆదుకున్నారు. ముప్పైతొమ్మిది కుటుంబాలు కలిస్తే ఒక్క కుటుంబాన్ని చూసుకోవడం అంత కష్టం కాదు. భగవంతుడి దయ వల్ల అందరూ కోలుకుని మామూలు మనుషులయ్యారు. బిడ్డకి మూడో నెలలో అత్యంత వైభవంగా నామకరణం చేసి 'నవదీప్' అని పేరు పెట్టాడు. విందు భోజనాలు సరే. మా బిల్డింగ్‌లో అందరికీ బట్టలు పెట్టాడు ఏవీరావు.

అంతే కాదు. ఆ నెలలోనే అయిదో ఫ్లోర్‌లో ఒక భాగం అమ్మకానికి పెడితే లోన్ తీసుకుని ఆ ఇల్లు తనే కొనుక్కుని, మా 'నవదీప్' అపార్ట్‌మెంట్సులో తనూ ఒక ఇంటివాడు అయ్యాడు.

*ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక, ఫిబ్రవరి 2010*

కథా నిలయం
6442
శ్రీకాకుళం